క్లుప్తంగా

విద్యా కానుకల పరిశీలన



పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈఓ

శిరివెళ్ల: మండలానికి సరఫరా అయిన విద్యా కానుకలను గురువారం డీఈఓ అనురాధ తనిఖీ చేశారు. జగనన్న విద్యా కానుకల కింద మండలానికి మొదటి విడతగా పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయి. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి విద్యార్థుల ప్రిపరేషన్‌ను డీఈఓ పరిశీలించి సూచనలు చేశారు. సప్లిమెంటరీ పరీక్షలలో అందరూ ఉత్తీర్ణులయ్యేలాచూడాలన్నారు. అనంతరం యర్రగుంట్ల జరుగుతున్న మన బడి- నాడు నేడు పనులను పరిశీలించి జూన్ 10లోగా పనులు పూర్తి చేయాలని హెచ్‌ఎంలను ఆదేశించారు.

శానిటరీ కిట్ల పంపిణీ



శానిటరీ కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): స్థానిక మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి గురువారం తన కార్యాలయంలో శానిటరీ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 మంది కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె, చెప్పులు, రెండు జతల యూనిఫాంతో కూడిన కిట్లను అందజేశామన్నారు. విధులు నిర్వర్తించేటప్పుడు కార్మికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిత్యం వృత్తిలో నిమగ్నమై ఆరోగ్యాలను అశ్రద్ధ చేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీని శిక్షించాలి

నంద్యాల(న్యూటౌన్): రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్‌సింగ్‌ను శిక్షించాలని మహిళా సమాఖ్య నంద్యాల జిల్లా అధ్యక్షురాలు నారాయణమ్మ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో నారాయణమ్మ మాట్లాడుతూ న్యాయం కోసం రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పోరాటం చేస్తున్నా కేంద్రం పట్టించుకోకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి సోమన్న, పీఈటీలు నరసింహ, జనార్ధన్, రవిశేఖర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు ధనుంజయుడు, తదితరులు పాల్గొన్నారు.

● నంద్యాల పట్టణంలోని నూనెపల్లె జంక్షన్‌లో జేవీవీ ఆధ్వర్యంలో మహిళా క్రీడాకారులకు మద్దతుగా నిరసన చేపట్టారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న బీజేపీ నేతలను అరెస్ట్ చేసి మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలని పలువురు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది శంకరయ్య, సీఐటీయూ నాయకులు భాస్కరాచారి, నాగేష్ పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం



పైపులైన్‌ను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రమేష్

ఉయ్యాలవాడ: మండలంలోని హరివరం గ్రామంలో రూ.5 లక్షలు వ్యయం చేసి పైపులైన్ నిర్మించడంతో పదేళ్లుగా ఉన్న తాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామంలోని గౌరమ్మ చావిడి వీధిలో అండర్‌గ్రౌండ్‌లో మురుగునీరు వెళ్లేందుకు డ్రైనేజీ ఏర్పాటు చేశారు. పక్కనే కుళాయి పైపులైన్ ఉండడంతో గ్రామంలోకి నీరు వదిలినప్పుడల్లా మొదట 5 నిమిషాల వరకు మురుగు నీరు కలిసి వచ్చేది. ఇదే విషయాన్ని పంచాయతీ కార్యదర్శి బండి రాజశేఖర్, సర్పంచ్ నడిపెన్న, ఉప సర్పంచ్ ఎర్రి శ్రీనివాసరెడ్డి.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రమేష్ ఏఈఈ ఫణీత్రిష్ణలు స్పందించి 15వ ఆర్థిక సంఘం నిధు ల నుంచి రూ.5 లక్షలు కేటాయించి నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయడంతో సమస్య తొలగిపోయింది.

మహిళ ఆత్మహత్యాయత్నం

రుద్రవరం: మండల పరిధిలోని టీ.కొట్టాలకు చెందిన మద్దమ్మ గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె బంధువులు తెలిపిన వివరాలు.. మద్దమ్మకు చాలా ఏళ్ల క్రితమే భర్త మృతి చెందాడు. ఇటీవల కుమారుడు కూడా మరణించాడు. కోడలు మతిస్థిమితం కోల్పోయి ఎటు వెళ్లిందో తెలియదు. దీంతో మనువడు, మనుమరాలి బాగోగులు మద్దమ్మే చూస్తోంది. గంపల అల్లికలతో వచ్చే డబ్బు సరిపోక, ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురై ఉరేసుకుని ఆత్మహత్యకు యత్నించింది స్థానికులు గమనించి ఉరి నుంచి తప్పించడంతో ప్రాణాపాయం తప్పింది. కాగా తల్లి, దండ్రి లేని అనాథ చిన్నారులకు మిషన్ వాత్సల్య పథకం వర్తింప జేసి ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ఫిట్‌నెస్ ఉంటేనే రైట్‌రైట్!

- ప్రైవేట్ స్కూల్ బస్సులపై నిఘా తీవ్రతరం
- ప్రారంభమైన తనిఖీలు
- ఫిట్‌నెస్ లేని బస్సులకు అనుమంతి నిరాకరణ
- గడువు తీరిన బస్సులు సీజ్
- నిబంధనలు అతిక్రమిస్తే సర్వీసులు రద్దు

విద్యార్థుల భద్రత నిమిత్తం ప్రైవేట్ పాఠశాల బస్సులపై ప్రభుత్వం నిఘా తీవ్రతరం చేసింది. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే అన్ని రకాల అనుమతులున్న బస్సులను సిద్ధంగా ఉంచుకోవాలని విద్యాసంస్థల యాజమాన్యాలను ఆదేశించింది. అందులో భాగంగానే రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అధికారులు బస్సుల తనిఖీ చేపట్టారు. ఫిట్ నెస్ లేని బస్సులను నిలిపేస్తున్నారు. గడువు తీరిన బస్సులను సైతం సీజ్ చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి రోడ్డుమీదకు తీసుకొస్తే సర్వీసు రద్దు చేస్తామని హెచ్చరిస్తున్నారు.

నంద్యాల(న్యూటౌన్): ఏడాది క్రితం పొందిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) ఈ ఏడాది మే నెలలో ముగియనున్న నేపథ్యంలో ప్రతి ప్రైవేట్ పాఠశాల, కళాశాలల యాజమానులు తప్పకుండా రెన్యూవల్ చేయించుకోవాల్సి ఉంది. అనుమతులు లేకుండా బస్సులు రోడ్డెక్కితే సీజ్ చేయటంతో పాటు జరిమానాలు విధించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో 350కు పైగా బస్సులు

జిల్లాలో ఆర్‌టీఓ అధికారులు గణాంకాల ప్రకారం 350కు పైగా పాఠశాల, కళాశాలల బస్సులు ఉన్నాయి. రూల్ నెంబర్ 185(ఎఫ్) ప్రకారం కచ్చితంగా ప్రతి స్కూల్, కళాశాలల యాజమాన్యాలు పాటించాల్సిన నిబంధనలు ఉన్నాయి. అందులో వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి. ఆర్‌టీఓ అధికారులు పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించిన తర్వాతే బస్సు రోడ్డెక్కేందుకు అనుమతులు ఇస్తారు.

నిబంధనలు ఇలా..

● స్కూల్ బస్సు డ్రైవర్‌కు 60 ఏళ్ల వయో పరిమితి దాటిన వ్యక్తి అనర్హుడు.





బస్సులను తనిఖీ చేస్తున్న ఆర్‌టీఓ అధికారులు

● డ్రైవర్‌కు ప్రతి మూడు నెలలకోసారి కచ్చితంగా ఆరోగ్య పరీక్షలు ఆయా యాజమాన్యాలు విధిగా చేయించి, ఆ రికార్డులను భద్రపరచాలి.

● డ్రైవర్ల నియామకాన్ని ఆర్‌టీఓ అధికారులకు తెలియజేయుటంతో పాటు, 5 ఏళ్ల అనుభవం, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.

● కళాశాల, స్కూల్ ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రులతో కూడిన కమిటీ ఏర్పాటు చేయటంతో పాటు, ప్రతి నెలా వాహనానికి సంబంధించి స్థితిగతులను రిజిస్టర్ చేయటంతో పాటు, ప్రతి వాహనంలో ఫిర్యాదు పుస్తకాన్ని ఉంచాలి.

● బస్సులో అత్యవసర ద్వారం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అగ్నిమాపక పరికరం, బ్యాగుల భద్రపరుచుకునే బాక్సులు సబ్‌రూల్ ఏ, బీ ప్రకారం తప్పని సరిగా ఉండాలి.

● ప్రతి బస్సులో ఒక అటెండర్ ఉండాలి. వాహనంలో ప్రయాణించే విద్యార్థుల వివరాలను ఆయా విద్యాసంస్థల విద్యార్థుల వివరాలను ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు నోట్ చేసుకోవడంతో పాటు, తల్లిదండ్రులకు డ్రైవర్ వివరాలను తెలియజేయాలి.

కేసులు నమోదు..

నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై కేసులు నమోదు చేయటంతో పాటు సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. దానిలో భాగంగా 2020-21 సంవత్సరంలో కరోనా సమయంలో 14 కేసులు, 2021-22 సంవత్సరంలో 37 కేసులు, 2022-23 మే నెల వరకు 16 కేసులు నమోదు చేయగా, ఈ మూడేళ్లలో మొత్తం 67 కేసులు నమోదు చేశారు. మే నుంచి కళాశాలలు, పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఎఫ్‌సీ లేకుంటే సీజ్ చేస్తాం



స్కూల్ యాజమాన్యం తమ బస్సుకు సంబంధించి కచ్చితంగా ఆర్‌టీఓ అధికారుల నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్(ఎఫ్‌సీ) పొందాలి. ప్రభుత్వ అనుమతులు లేకుండా వాహనం రోడ్డెక్కితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎటువంటి నిబంధనలు పాటించకపోయినా బస్సులు సీజ్ చేయటంతో పాటు, కేసులు నమోదు చేస్తాం. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని పరీక్షలు పూర్తి చేసుకోవాలి.

– శివారెడ్డి, డీటీఓ, నంద్యాల

నాడు-నేడు పనులపై సమీక్ష

ఉయ్యాలవాడ: పాఠశాలల్లో చేపడుతున్న నాడు - నేడు పనులపై శుక్రవారం స్థానిక ఎమ్మార్సీలో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ అనురాధ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

నలుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

రుద్రవరం: మండల పరిధిలోని బి.నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, గురుమోహన్, వెంకటరమణ, గురుదేవిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శోబన్‌బాబు గురువారం తెలిపారు. గ్రామానికి సమీపంలో గుర్రప్ప మాను మెట్ట వద్ద ఉన్న సుధాకర్ అనే వ్యక్తిని కులం పేరుతో దూషించారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మాన్యం భూముల కౌలు వేలం వాయిదా

రుద్రవరం: మండల పరిధిలోని పేరూరు ఈశ్వర, రామాంజనేయ స్వామి వారి మాన్యం భూముల కౌలు వేలాన్ని దేవదాయ శాఖ అధికారులు గురువారం వాయిదా వేశారు. వేలం పాట ప్రారంభ సమయంలో టీడీపీ వర్గీయులు అడ్డుతగలడంతో ఈఓ నర్సయ్య వేలం పాటలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి వేలం నిర్వహించే తేదీని ప్రకటిస్తామన్నారు. కాగా బీరవోలు, చిలుకలూరు గ్రామాల్లో మాన్యం భూముల కౌలు వేలం సవ్యంగా సాగాయి.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే

శిరివెళ్ల: అన్ని వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం 1, 2వ సచివాల పరిధిలోని మంగళిపేట, తెలుగుపేటలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాతుతూ 4 ఏళ్లలో ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.5 లక్షలు దాకా లబ్ధి అందిందన్నారు. నియోజకవర్గంలో అంతర్గత రోడ్లు, గ్రామీణ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న జగనన్నను మరోసారి సీఎంగా ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, ఎంపీపీ నాయక్ వసీం, జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌నాయక్, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి, దేవస్థానం చైర్మన్ దాదిరెడ్డి తిమ్మరాయుడు, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ హఫీజ్, నాయకులు ముడిమేల నాగరాజు, ఉల్లి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోగుల పట్ల శ్రద్ధ వహించాలి

నంద్యాల టౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్దకు చికిత్స కోసం వచ్చే రోగుల పట్ల శ్రద్ధ వహించాలని డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఆర్ వెంకటరమణ సూచించారు. స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆశా కార్యకర్తలకు ఆయన హెచ్‌బీ మీటర్స్, స్ట్రిప్స్ పంపిణీ చేశారు.

నేడు మండల సమావేశం

ఆళ్లగడ్డ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బారెడ్డి గురువారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు.

స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసుకోండి

నంద్యాల: భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం రానున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా కలెక్టర్లకు సూచించారు. గురువారం రాష్ట్ర ఎన్నికల అధికారి కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో నంద్యాల కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, డీఆర్ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోండి

దొర్నిపాడు: ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ జయప్రసాద్ లబ్ధిదారులకు సూచించారు. గురువారం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో గృహనిర్మాణ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి కావాల్సిన సామగ్రితో పాటు బిల్లులు కూడా త్వరగానే మంజూరవుతాయని, వీలైనంత త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ నాగఅనసూయ, జెడ్పీటీసీ సభ్యులు శకుంతల, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు యాదవ్, హౌసింగ్ ఏఈ జేమ్స్ ప్రసాదరావు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ బ్రహ్మం పాల్గొన్నారు.

కాడెద్దుల సేద్యం కనుమరుగు

- వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు
- పెరిగిన యాంత్రీకరణ

ఉయ్యాలవాడ: నేడు వ్యవసాయ రంగంలో సాంకేతిక విప్లవం కారణంగా కాడెద్దుల పాత్ర కనుమరుగవుతోంది. ఒకప్పుడు ఎద్దులు లేకుండా పొలంలో కనీసం చిన్న పని కూడా చేపట్టలేని పరిస్థితి. యంత్ర పరికరాలు అందుబాటులోకి రావడం, ట్రాక్టర్‌తో దుక్కులు దున్నడం, విత్తనం వేయడం, వరి నాట్లు, కోతలు, పంట నూర్పిళ్లు కూడా యంత్రాల ద్వారానే చేస్తుండటంతో వ్యవసాయం ఆధునికమైంది. ఈక్రమంలో మండలంలో ఖరీఫ్ సీజన్‌కు మే నెలలోనే రైతులు సమాయత్తమయ్యారు. ఈ నెల ప్రారంభం నుంచే తొలకరి వర్షాలు కురిశాయి. ప్రస్తుతం దుక్కులు చేసుకోవడానికి సరిపడే తేమ భూమిలో ఉంది. ట్రాక్టర్ల సాయంతో లోతుగా దుక్కులు దున్నే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.



ఉయ్యాలవాడ సమీపంలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

సమయం ఆదా

ఎకరా పొలం ఎద్దులతో సేద్యం చేయించాలంటే రైతుకు రెండు రోజుల సమయం పడుతుంది. అదే ట్రాక్టర్‌తో అయితే రెండు గంటల్లోపు పూర్తి చేయవచ్చు. దీంతో ఎక్కువ శాతం రైతులు ట్రాక్టర్లకు యంత్ర పరికరాలు అమర్చుకుని వ్యవసాయ పనులు పూర్తి చేస్తున్నారు.

మేత ఇబ్బందులు

గతంలో గ్రామాల్లో ఖాళీ స్థలాలు ఉండేవి. మేత నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉండేది. రోడ్ల పక్క స్థలాలు, పంట పొలాలు సైతం గృహాల కోసం ప్లాట్లుగా మారుతున్నాయి. పంట కోత నూర్పిళ్లతో పశుగ్రాసానికి డిమాండ్ పెరిగింది. పశువుల మేత దొరకని పరిస్థితి. నాకున్న కాడెద్దులను అమ్ముకున్నాను. ట్రాక్టర్ సాయంతో పొలాన్ని సాగు చేసుకుంటున్నా.

– వెంకటసుబ్బారెడ్డి, రైతు, ఉయ్యాలవాడ

పెరగనున్న పోషకాలు

పంట కోతల తరువాత నేలపై మిగిలే మొదళ్లు, పొలంలో మిగిలిన కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకులు లోతు దుక్కులకు నేలలో కలిసి కుళ్లి పోయి భూమి సారవంతమవుతుంది. అలాగే నేలను లోతుగా దున్నినప్పుడు గట్టి పొర ఛేదించబడి నీటిని పీల్చుకుని తద్వారా అధిక దిగుబడులు అందుతాయి.

– రాజేంద్రకుమార్, మండల వ్యవసాయాధికారి

సీఎం సహాయనిధితో ఆరోగ్య భరోసా

- లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ
- టీడీపీకి ఓట్లు వేసినా సాయం అందడంపై లబ్ధిదారులు హర్షం



లబ్ధిదారులతో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం నియోజకవర్గంలోని 8 మందికి రూ.19.45 లక్షల విలువైన సీఎం సహాయ నిధి చెక్కులను స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ ఏ ప్రభుత్వంలో కూడా పార్టీలకు, వర్గాలకు అతీతంగా సీఎం సహాయ నిధి అందేది కాదన్నారు. అనారోగ్యంతో బాధపడే పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు, కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు భరోసా కల్పించేందుకు సీఎం సహాయ నిధి పథకం ఎంతగానో దోహదపడుతున్నాదన్నారు.

ఆర్థిక సాయం వస్తుందనుకోలేదు

ఉయ్యాలవాడ మండలం కొండుపల్లె గ్రామానికి చెందిన వెంకటరెడ్డి 20 ఏళ్లుగా టీడీపీ జెండా మోస్తూనే ఉన్నాడు. గత కొన్ని నెలల క్రితం షుగర్ విపరీతంగా పెరిగి తీవ్ర అశ్వస్థతకు లోనై నంద్యాల వైద్యశాలలో చేరాడు. తొందరగా ఆపరేషన్ చేయకుంటే బతకడం కష్టమని ఇందుకు రూ 4.5 లక్షలు అవసరము అవుతుందని వైద్యులు చెప్పారు. ఆ వైద్యశాలలో ఆరోగ్య శ్రీ సేవలు లేక పోవడంతో అప్పు చేసి ఆపరేషన్ చేయించుకున్నాడు. అయితే ఆర్థిక సమస్యతో కొట్టుమిట్టాడుతున్న ఈ విషయం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణ సాయంగా రూ.75 వేల మంజూరు చేయించి ఆదుకున్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి ఉంటే పేదలందరికీ న్యాయం జరుగుతుందని వెంకటరెడ్డి చెబుతున్నారు.

ఎన్ని జన్మలెత్తినా రుణం తీర్చుకోలేనిది

ఆళ్లగడ్డ పట్టణంలోని రహిమాన్ వీధికి చెందిన షేక్ షరహానా భర్త గఫార్‌బాషా భర్త ఫ్రిజ్‌లు, కూలర్‌లు రిపేర్ చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. గఫార్‌బాషాగత రెండు నెల క్రితం రాత్రి పడుకుని తెల్లారే సరికి గుండె పోటుతో మృతి చెందాడు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి మృతి చెందడంతో ఏం చేయాలో ఈమెకు అర్థం కాలేదు. ×సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుందామంటే దశాబ్దాలుగా భూమా కుటుంబానికి ముఖ్య అనుచరులుగా తిరిగే మీకు ఎలా వస్తుందని చెప్పారు. అయినా ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవడంతో నా పేదరికాన్ని చూసి ఎమ్మెల్యే వెంటనే సీఎం సహాయనిధికి సిఫార్స్ చేయడంతో రూ.2 లక్షలు వచ్చింది. మేం ఓట్లు వేయక పోయినా మా మీద దయతో సీఎం సహాయ నిధి మంజూరు చేసిన సీఎం రుణం ఎన్ని జన్మలెత్తిన తీర్చుకోలేనిది₹

– షేక్ షరహానా, ఆళ్లగడ్డ

సెలవుల్లో ఎంపీడీఓ

ఉయ్యాలవాడ: స్థానిక ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు జూన్ 2వ తేదీ వరకు దీర్ఘ కాలిక సెలవుల్లో వెళ్లారు. దీంతో కార్యాలయ పరిపాలనాధికారి సత్యన్నకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా పరిషత్ సీఈఓ జారీ చేసిన ఉత్తర్వులు గురువారం కార్యాలయానికి అందాయి.

వివాహిత ఆత్మహత్యాయత్నం

– ఐదుగురిపై కేసు నమోదు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ కొత్తపల్లె గ్రామానికి చెందిన రోజారమణి అత్తారింటి వేధింపులు తాళలేక గురవారం ఆత్మహత్యాయత్నం చేసింది. ఎస్ఐ తిరుపాల్ తెలిపిన వివరాలు.. కొద్దిరోజులుగా రోజారమణిని అదనపు కట్నం తేవడంతో పాటు కొడుకు పుట్టలేదని భర్త నరసింహుడు, అత్త మామలు సుశీలమ్మ, ఓబన్న, మరిది బాలుడు శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. దీంతో విసుగు చెంది నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

శిరివెళ్ల: కాదరబాదర జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆర్‌డీఓ శ్రీనివాస్ సూచించారు. గురువారం కాలనీలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల పురోగతిని హౌసింగ్ ఏఈ అహమ్మద్‌బాషాను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఈఓఆర్డీ సాల్మన్‌రాజు, ఆర్ఐ సుచరిత పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

ఆళ్లగడ్డ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని అటవీ అధికారి ముక్తార్‌బాషా కోరారు. గురువారం రూరల్ మండలం మిట్టపల్లి గ్రామంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరు కనీసం ఒక మొక్క నాటి పెంచాలన్నారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

ఐరీష్ రీడర్లతో సరుకుల పంపిణీ

నంద్యాల(అర్బన్): వేలిముద్రలు పడని వృద్ధులు రోజువారి కూలీలు ఎండీయూ వాహనాల వద్ద ఉన్న ఐరీస్ రీడర్లను వినియోగించుకుని నిత్యావసర సరుకులను పొందవచ్చని జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి తెలిపారు. స్థానిక కార్యాలయంలో గురువారం జేసీ మాట్లాడుతూ పేదలకు ఆహార భద్రత చట్టం కింద కార్డుదారుల ఆధార్, వేలిముద్రల సమాచార ధ్రువీకరణ ప్రామాణికంగా నిత్యావసర సరుకుల పంపిణీ జరుగుతుందన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులతో నాయకులు

ఆళ్లగడ్డ: పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను గురువారం ఘనంగా సన్మానించారు. ప్రతిభకనబరిచిన విద్యార్థులకు వెదురూరి పురుషోత్తమరావు జ్ఞాపకార్థం ప్రోత్సాహ నగదు బహుమతులు, ప్రశంసా పత్రం అందజేవారు. కార్యక్రమంలో సాందీపని సేవా సమితి అధ్యక్షలు గోపాల్‌రావు, ఎంఈఓ శోభా వివేకవతి, హెచ్‌ఎం వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు సత్కారం

నంద్యాల: పది పరీక్షల్లో టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులను, పాఠశాల యాజమాన్యాన్ని సన్మానించనున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. గురువారం విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సంబంధిత కార్యదర్శులు అధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా విద్యాశాఖ అధికారులు, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారులు, ఆర్‌ఐఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభు త్వ పాఠశాలలో చదివి జిల్లా స్థాయిలో మొదటి, రెండవ, మూడవ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేయాలన్నారు. ఈనెల 25న నియోజకవర్గ స్థాయిలో, 27న జిల్లాస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఈఓ అనురాధ, డీవీఈఓ సునీత తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి

నంద్యాల(వ్యవసాయం): న్యాయవాదుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సూరజ్ గ్రాండ్‌లో ఏర్పాటు చేసిన న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనంలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో హైకోర్టు బార్ కౌన్సిల్ మెంబర్ కొవ్వూరు వెంకటరామిరెడ్డి, జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, పట్టణ లీగల్‌సెల్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన చేస్తున్నారని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని 15వ వార్డులో కౌన్సిలర్ అనూష ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శిల్పా రవి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో ఇచ్చిన హామీలు 99 శాతం నెరవేర్చారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పని చేయాలన్నారు.

పట్టణాభివృద్ధే లక్ష్యం



సీసీ రోడ్లు, డ్రైన్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(సిటీ): పట్టణాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ఎక్కడ ఏ సమస్య ఉన్నా పరిష్కారం చూపేందుకు సిద్ధంగా ఉన్నామని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే పట్టణంలోని 42 వార్డుల అభివృద్ధికి రూ.కోట్లు వెచ్చించామన్నారు. పట్టణంలోని 24వ వార్డులో రూ. 12లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులను మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, వైస్ చైర్మన్లు పాంశావలి, గంగిశెట్టి శ్రీధర్‌లతో కలసి ఎమ్మెల్యే శిల్పా రవి ప్రారంభించారు. అనంతరం వార్డు కౌన్సిలర్ షేక్ షెహనాజ్, వార్డు ఇన్‌చార్జ్ రహంతుల్లాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు.